నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం టెక్‌పార్క్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఏపీఫుడ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీ ఫుడ్స్, నాచారం ఐడీఏ రోడ్‌నెంబర్ 15, ఏపీ ఫుడ్‌లైన్, రోడ్‌నెంబర్ 01, ఐలా కమిషనర్ కార్యాలయం నుంచి చిలుకానగర్ చౌరస్తా వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ బాలజీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐడీఏ రోడ్‌నెంబర్ 15, జీవీకే లైన్, ఐడీఏ నాచారం, 11కేవీ కృష్ణ ఫార్మా ఫీడర్ పరిధిలో 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టెక్ పార్క్ సబ్‌స్టేషన్ రోడ్, శ్రీదేవీఫుడ్స్, ఎస్‌పీఎం కేబుల్స్, ఐడీఏ రోడ్ నెంబర్14లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ మేకల సునీతారామయాదవ్ శనివారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గౌతంనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

బోడుప్పల్: 23వ డివిజన్ పరిధిలోని వాసవీనగర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం జలమండలి జీఎం సునీల్‌కుమార్, బోడుప్పల్ మేనేజర్ మమతకు వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా వీధి నంబరు– 6లో తాగునీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని పేర్కొన్నారు. దీంతో నిత్యం నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, గడిచిన రెండు నెలల నుంచి ఓ వైపు వాటర్ బిల్లులు చెల్లిస్తూ.. మరో వైపు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నామన్నారు. వెంటనే అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు మోహన్‌బాబు, కోశాధికారి సాయి గణేష్, సలహాదారులు కోటేశ్వరరావు, సభ్యులు రామకృష్ణ, నిఖిల్‌మూర్తి, ఎం. శ్రీనివాస్‌రావు, నర్సింహులు తదితరులున్నారు.

విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించాలి

అల్వాల్: అల్వాల్ రాజీవ్ సర్కిల్ వద్ద గల సిండికేట్ రైతు సేవా పరపతి సంఘం భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన అభ్యాస కళాశాలను శనివారం మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి మన్ననలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం విశాల్, మహేందర్‌గౌడ్, స్వామిగౌడ్, పూర్ణగౌడ్, వినీత్, రైతు సంఘం చైర్మన్ తోట గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజసింహారెడ్డి, నాగేశ్వర్‌రావు, ఉదయ్‌కుమార్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పదవి కోసం తప్పుడు గుర్తింపు కార్డు

అల్వాల్: పార్టీ పదవికోసం తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పదవి పొందిన ఓ బీజేపీ నాయకుడిపై కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. మల్కాజిగిరి నియోజకవర్గం డివిజన్ కమిటీ ఎన్నికలు నిర్వహించింది. పార్టీ నిబంధనల ప్రకారం డివిజన్ అధ్యక్ష పదవికి పోటీ చేసే వారు 45 ఏళ్ల లోపు ఉండాలి. వెంకటాపురం డివిజన్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన శ్రీధర్‌రెడ్డిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన వయస్సు 27-03-1977కి బదులు 1981గా మార్పు చేసుకున్నాడు. ఈ మార్పుతో ఆయనను డివిజన్ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు. దీంతో కనాజీగూడ ఇందిరానగర్‌కు చెందిన సుప్రియరాజ్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించిన అధికారులు శ్రీధర్‌రెడ్డి తప్పుడు వివరాలు అందించి ఎన్నికల గుర్తింపుకార్డు పొందాడని నిర్ధారించి అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .

మహిళా స్నాచర్స్ దొరికారు..

ఇద్దరి రిమాండ్

ఉప్పల్: మహిళ మెడలో నుంచి స్నాచింగ్ చేసిన మహిళలు దొరికారు. శుక్రవారం విజయపురి కాలనీ వర్ష బ్యాంగిల్ స్టోర్ యాజమాని సంధ్య మెడలో నుంచి మూడు తులాల పుస్తెలతాడును దొంగిలించిన మహిళా స్నాచర్స్‌ను పోలీసులు గాలించి అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి పుస్తెలతాడును రికవరీ చేశామన్నారు. నిందితులు హనుమసాయినగర్ ప్రాంతానికి చెందిన ఉష, ఆమె సోదరి శిరీషలుగా గుర్తించి వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

కుమార్తెలతో సహా తల్లి అదృశ్యం

మల్కాజిగిరి: ఇద్దరు చిన్నారులతో సహా తల్లి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన బత్తుల ప్రదీప్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రేమ వివాహం కాగా.. భార్య పద్మ(28), కూమార్తెలు హారిణి(5),దావని(4) ఉన్నారు. కుటుంబసమస్యలతో ఈనెల 14న ఇద్దరు పిల్లలను తీసుకుని భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం రాత్రి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల కొరతతో అవస్థలు

• బోడుప్పల్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు • పెద్దఎత్తున ఆదాయం కోల్పోతున్న నగర పాలక సంస్థ • విఫలమవుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరత ఉంది. కేవలం ఒక్క టీపీఎస్ మాత్రమే ఉన్నారు. దీంతో అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల నగర పాలక సంస్థ పెద్దఎత్తున ఆదాయాన్ని కోల్పోతుంది. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది అధికార పార్టీకి చెందిన నేతలు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరత..

బోడుప్పల్ నగర పాలక సంస్థ 20 చ.కిమీ విస్తీర్ణంలో విస్తరించి ఉంది. విస్తీర్ణాన్ని బట్టి టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఒక అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి (ఏసీపీ), ఒక టౌన్‌ప్లానింగ్ అధికారి (టీపీఓ), 4 టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్లు (టీపీఎస్)లు, ఇతర సిబ్బంది ఉండాల్సి ఉంది. ఇక్కడ స్థానిక అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉండటంతో ఎవరూ పనిచేసేందుకు ముందుకు రావడం లేదనే విమర్శలున్నాయి. ప్రస్తుతం కేవలం ఒక టీపీఎస్ మాత్రమే పనిచేస్తున్నారు. అది కూడా మూడ్రోజులు ఇక్కడ, మరో మూడ్రోజులు కామారెడ్డిలో పనిచేస్తున్నారు.

100కు పైగా నిర్మాణాలు..

అధికారుల కొరతను ఆసరాగా చేసుకుని అధికార పార్టీ నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. నగర పాలక సంస్థ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా 8 షెడ్‌లు నిర్మిస్తున్నారు. అలాగే వక్ఫ్ బోర్డు స్థలంలో అనుమతులు లేకుండా 100కు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల అక్రమ కమర్షియల్ షట్టర్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నగర పాలక సంస్థ పెద్దఎత్తున ఆదాయాన్ని కోల్పోతుంది.



నగర పాలక సంస్థ కార్యాలయం

పర్యవేక్షణ కరువు..

అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు అక్రమ నిర్మాణాలను ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరత ఉండటంతో తమకు అనుకూలంగా ఉన్న సిబ్బందిని టౌన్‌ప్లానింగ్ విభాగంలో పెట్టుకుని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని వినికిడి. వారి ద్వారా తమ కార్యకలాపాలను యధావిధిగా కొనసాగిస్తున్నట్లు సమాచారం. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా అక్రమ నిర్మాణాలను తమ ఆదాయ వనరులుగా మార్చుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..



నగర పాలక సంస్థ పరిధిలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరతపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అక్రమ నిర్మాణాలను నియంత్రించేంత అధికార యంత్రాంగం లేదు. ప్రస్తుతం జరుగుతున్న అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు అందజేశాం. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో కూల్చివేసేందుకు సిద్ధంగా ఉన్నాం. పోలీసు ప్రొటెక్షన్ కూడా కోరాం.

– శైలజ, కమిషనర్, బోడుప్పల్

కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలి



ఎల్లారెడ్డిగూడలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్: అర్హులైన నిరుపేదలకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే తహసీల్దార్ వాణిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. మండల పరిధిలో 122 చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు వివరించారు. కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ తదితరులున్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి, తహసీల్దార్ వాణిరెడ్డి

ఉచిత వైద్య శిబిరంతో పేదలకు మేలు

కాప్రా: నిరుపేదల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఎల్లారెడ్డిగూడలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో కిమ్స్ ఫౌండేషన్ సహకారంతో బీఎల్ఆర్ ట్రస్ట్, చాముండేశ్వరి గురుదత్తా ట్రస్ట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యంపై పేద ప్రజలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వ్యవహరించకుండా అవగాహన కల్పించేందుకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా అల్ట్రా సౌండ్ అబ్డామినల్, యూజీఐ ఎండొస్కోపి, ప్రోటోస్కోపి, ఈసీజీ, 2 డీఈకో, సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, సీరం క్రియాటిన్, రాండం బ్లడ్‌షుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఫైబ్రోస్కాన్, బోన్‌స్కాన్, యూరిక్‌యాసిడ్ వంటి పరీక్షలు నిర్వహించారు.

కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ఆటో కార్మికులకు పత్రాలను అందజేస్తున్న శ్యామ్‌సుందర్‌రావు

బోడుప్పల్: ప్రతి రోజు డోర్ టు డోర్ చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోల కార్మికుల ఆరోగ్యం కోసం కృషి చేద్దామని బోడుప్పల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రావు అన్నారు. బోడుప్పల్ జడ్‌పీటీసీ పాఠశాలలో శనివారం స్వచ్ఛ ఆటోల కార్మికుల కోసం నిర్వహించిన ప్రొఫైలింగ్ క్యాంప్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వారికి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెత్త సేకరించడంతో పాటు ఆరోగ్యవంతంగా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య భద్రతకార్డులు క్రియేట్ చేయడంతో పాటు వారికి కేంద్రప్రభుత్వం నుంచి పీపీఈ కిట్స్ వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణ రెడ్డి, రాష్ట్ర కో– ఆర్డినేటర్ మల్లేష్, స్వచ్ఛ ఆటోల కార్మికులు పాల్గొన్నారు.

రాణి అహల్యాబాయి హోల్కర్‌కు నివాళి



వాణినగర్‌లో అహల్యాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గౌతంనగర్: రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను శనివారం గౌతంనగర్ డివిజన్ వాణినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ.. మొగలులు నేలమట్టం చేసిన అనేక దేవాలయాలను ఆమె పునర్నిర్మించారు. కాశీ, ద్వారక, మధుర, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్, ఘృష్ణేశ్వర్ ఇలా అనేక ఆలయాలను పునరుద్ధరించారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్, బాల సుబ్రహ్మణ్యం, వెంకట్, కిషోర్, స్వర్ణలత, సచిన్,ఆనంద్, వెంకట్‌యాదవ్, బండారిరవి, అమర్, పెంటయ్య, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: రాజమాత అహల్యాబాయి జయంతిని నాచారంలో శనివారం ఘనంగా నిర్వహించారు.అహల్యాబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప్పల్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మంజుల వాణి మాట్లాడుతూ.. ధర్మరక్షణకు మహిళలకు ఇచ్చిన ప్రోత్సాహం, సేవా కార్యక్రమాలు అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి పాతగాని గోపాల్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నవీన్, మల్కా ప్రకాష్, శ్రీధర్‌రెడ్డి, గోపి, మోహన్‌రెడ్డి, రవికాంత్, నవీన్‌గౌడ్, చిల్లా అశోక్ పాల్గొన్నారు.



అహల్యాబాయి జయంతి వేడుకల్లో బీజేపీ నేతలు

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

ఉప్పల్: హబ్సిగూడ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలపై ఉప్పల్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ ప్రతిమను కలిసి సమస్యలపై శనివారం కలిసి విన్నవించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్లు, జనావాసాల్లో ఉన్న స్తంభాలను తొలగించాలని కోరారు. అర్హులకు గృహజ్యోతి పథకం అందడం లేదని, దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో మారిణేని ఫణీంధర్, శామీర్‌పేట ధర్మారెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రమేష్, సతీష్, తీగ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్

కాప్రా: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మేడ్చల్ –మల్కాజ్‌గిరి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు సేవించడంతో కలిగే అనారోగ్య కారణాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ప్రతి ఏటా మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తారు. పొగాకు వాడకంతో కలిగే ప్రమాదాలు, జీవన హక్కును పొగాకు ఎలా హరిస్తుందనే విషయాలపై భవిష్యత్ తరాలను అవగాహన పెంచడమే ఈ దినోత్సవ లక్ష్యం. దీనిలో భాగంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ డి.కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై పారా లీగల్ వాలంటీర్స్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో ప్రతిజ్ఞ చేయించారు.

100 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సదస్సు

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు చేపట్టనున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళికపై శనివారం ఆర్ కన్వెన్షన్‌హాల్‌లో కమిషనర్ ఆధ్వర్యంలో కాలనీసంఘాల అధ్యక్షులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, మున్సిపల్ స్టాఫ్, సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శైలజ మాట్లాడుతూ.. చెత్త నిర్వహణ, తాగునీటి సమస్య, ఆస్తి పన్ను సమస్యలు, డ్రైనేజీ, వన మహోత్సవం, వీధి దీపాలు, దోమల నివారణపై అన్ని విభాగాలు సమన్వయంతో 100 రోజుల ప్రణాళికను చేపట్టనున్నట్లు వివరించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రావు, డీఈ చిరంజీవులు, అసిస్టెంట్ ఇంజినీర్ రాకేష్, రెవెన్యూ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిషనర్ శైలజ

గుండెపోటుతో జర్నలిస్టు మృతి

ఉప్పల్: ఉప్పల్ ప్రాంతంలో దీర్ఘకాలంగా జర్నలిస్టుగా పనిచేస్తున్న మాదిరాజ్ సురేష్ శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతిపై పలువురు సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నేతలు తమ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, శామీర్‌పేట ధర్మారెడ్డి, గోరిగే కృష్ణ తదితరులు నివాళులర్పించారు. వీరితో పాటు బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నేత మందుముల పరమేశ్వర్‌రెడ్డిలు విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. తక్షణసాయంగా ఎమ్మెల్యే బండారి బాధిత కుటుంబానికి రూ. 25 వేల ఆర్థికసాయం అందించారు.



సురేష్ (ఫైల్)

గంజాయి విక్రేతల రిమాండ్

మల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బిహార్‌కు చెందిన తుంటున్ కుమార్‌శర్మ (20), బిందేశ్వరిశర్మ(47) కొంతకాలంగా గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్నారు. మల్లాపూర్ నాగలక్ష్మీనగర్ కాలనీలో గంజాయి విక్రయిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు రెక్కీ నిర్వహించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.